క్లుప్తంగా

## ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా సోమవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయనను కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం గడువు ఈనెల 26న ముగిసిన విషయం విధితమే. దీంతో తాజాగా ప్రత్యేక అధికారుల పాలన ఆరంభమైంది.

## చక్రాపూర్‌లో వైద్య శిబిరం

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్‌లో సోమవారం ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని స్థానిక యువకులు ఏర్పాటు చేయించారు. 18 మంది యువకులు రక్తదానం చేయగా, సుమారు 450 మందికి ఎస్‌వీఎస్ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించిన యువకులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో దయాకర్‌గౌడ్, ధర్మేందర్, శేఖర్, శ్రీకాంత్, భాస్కర్‌నాయక్, సంతోష్, అశోక్, నాగరాజు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తాం



దేవరకద్ర: ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిని అధికారులు పరిశీలించారు. వారంలోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓకు ఘనంగా సన్మానం



నవాబుపేట: ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ జయరాంనాయక్‌కు సోమవారం మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధిహామీ, మహిళా సమాఖ్య అధికారులతో పాటు నవాబుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచంద్రయ్య, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు.

## రోడ్డు భద్రతా చర్యలు



దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని 167వ జాతీయ రహదారిలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్ల పక్కన పెరిగిన ముళ్ల చెట్లను తొలగింపు పనులు సోమవారం చేపట్టారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకద్ర పోలీసులు మలుపులు, వంతెనలు ఉన్న ప్రాంతాలలో అడ్డుగా ఉన్న ముళ్ల చెట్లను, పొదలను జేసీబీతో తొలగించారు. గోప్లాపూర్ మలుపు వద్ద, స్టేజీ వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. పనులను ఎస్‌ఐ నాగన్న పర్యవేక్షించారు.

## నిబంధనలకు విరుద్ధంగా నియామకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్‌గా స్కూల్ అసిస్టెంట్ శివయ్య లోకల్‌బాడీ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్నారని, ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధమని జీటీఏ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కోఆర్డినేటర్‌గా కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికే కేటాయించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లోకల్‌బాడీలో పనిచేస్తున్న వారిని కేటాయించడంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత డీఈఓ రవీందర్ నిబంధనలకు విరుద్ధంగా పోస్టు కేటాయించారని, దీన్ని పరిగణలోనికి తీసుకుని నియామక ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగం రఘురాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి సేవలు అందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని రైతాంగానికి అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ–2025, టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగుకు అవసరమైన మెలకువలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ, పంటల దిగుబడి అధికంగా వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడి, తమ పంటలను కాపాడుకోవాలో రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేసి వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ బి.వెంకటేష్, వైస్ చైర్మన్ ఏ.ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కృష్ణ కిషోర్, కోశాధికారి ఎన్.రాజేందర్ అగర్వాల్, అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏటీలు నరేందర్, ప్రదీప్‌కుమార్, రాజేష్ కన్నా, శివకుమార్, సిద్ధార్థ, ఇష్రత్ సుల్తానా, బ్యూల, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

# గోవా మంత్రిని కలిసిన మాజీ మంత్రి



గోవా మంత్రి సుభాష్ శిరోద్కర్‌తో చర్చిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర మాజీ మంత్రి, ఓబీసీ ముఖ్య సలహాదారులు శ్రీనివాస్‌గౌడ్ సోమవారం గోవా రాష్ట్ర మంత్రి సుభాష్ శిరోద్కర్, మాజీ ఉప ముఖ్యమంత్రి బాబు కవ్లేకర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఓబీసీల సమస్యలపై చర్చించారు. వైద్య విద్యలో ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఇతర రాష్ట్రాలలో వైద్య విద్య రిజర్వేషన్ల మాదిరిగా గోవాలో కూడా అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఓబీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి సహకరించాలన్నారు. గోవా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర రాష్ట్రాలలో వలె ఓబీసీ రిజర్వేషన్లను పెంచడానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. గోవాలోని ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమాజ్ ఓబీసీ నాయకులు బండారి గౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు మధు అనంత్‌నాయక్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి సర్వేశ్ పాల్గొన్నారు.

# నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ డిమాండ్ చేశారు. సోమవారం షాషాబ్‌గుట్ట ఏరియా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులతో పాటు పెన్షన్ పంపిణీ, మహిళలకు రూ.2500లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాము, మాధవి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండ దేవాలయ డైరెక్టర్‌కు సన్మానం



దేవాలయ డైరెక్టర్ సురేందర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల మన్యంకొండ దేవాలయం పాలక మండలి బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన సురేందర్‌ను ఘనంగా సన్మానించారు. శ్రీ శివ మార్కండేయ దేవాలయం కమిటీ కార్యాలయంలో జై మార్కండేయ జై పద్మశాలి పట్టణ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అనంతరం యువజన సంఘం అసోసియేట్ సెక్రటరీ జనరల్‌గా నరేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాస రామస్వామి, బిజిశంకర్, వెంకటేష్, రవి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ యువజన సంఘం అధ్యక్షుడు నీలి వెంకటకిషోర్, ప్రవీన్, సంతోష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రకారం బోధించాలి

- మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్



మాట్లాడుతున్న అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రకారం విద్యా బోధన చేయాలని అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రభుత్వ పాఠశాలలో పీఎస్ స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూడైస్ ప్లస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వసతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. విద్యార్థుల సెంట్రల్ పిన్ నంబర్ ఆపార్‌ను అన్ని పాఠశాలలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి ప్రశస్తు యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారమే వడ్డించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో తప్పనిసరిగా సమావేశం నిర్వహించాలన్నారు. నెలకోసారి అమ్మ ఆదర్శ పాఠశాల సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోయపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సి.కవిత, షాషాబ్‌గుట్ట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సేవియానాయక్, సీఆర్‌పీలు కె.శ్రీనివాసులు, గీత, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ విధానం రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/కోయిల్‌కొండ: ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎస్ మండల అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని నేషనల్ పెన్షన్ స్కీంలో భాగంగా సీపీఎస్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబర్ ఒకటిన ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. భద్రత లేని సీపీఎస్ విధానాన్ని దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారన్నారు. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని అక్కడి ప్రభుత్వం పునరుద్ధరించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దుచేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి సి.కృష్ణయ్య, టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కష్టయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి. సంజీవరెడ్డి, టీజీయూఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కిషన్, బాల్ రాజ్, బాబు, జోగు శ్రీనివాస్, పాండు, వినయ్‌కుమార్, మల్లేష్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ మండల నాయకులు తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాళప్పలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ నాయక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వెంకట్‌రెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులు వస్తే తట్టుకోలేని బీఆర్‌ఎస్

స్టేషన్ మహబూబ్‌నగర్: దావోస్‌లో రూ.లక్షా78 వేల పెట్టుబడులు తెలంగాణకు వస్తే బీఆర్‌ఎస్ నాయకులు తట్టుకోవడం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే కడుపు మంటతో రగిలిపోతున్నారని, అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రైతుబంధు కింద రూ.10వేలు ఇస్తే, ఇప్పటి ప్రభుత్వం ఎకరానికి రూ.12వేలు పెంచితే ఓర్చుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.12వేలు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. నిరుద్యోగులకు ఒక్క ఏడాదిలోనే 55143 ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన తెలిపారు.

## మల్లెబోయిన్‌పల్లి రైతులకు రైతు భరోసా

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి గ్రామ రైతులకు సోమవారం ప్రభుత్వం అందించిన రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు మండల వ్యవసాయ అధికారి గోపినాథ్ తెలిపారు. దాదాపు 537 మంది రైతులకు 834 ఎకరాలకు రైతు భరోసా సహాయం అందినట్లు తెలిపారు. మిగతా గ్రామాలకు సైతం రైతు భరోసా అందనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 29న మందకృష్ణ రాక

మిడ్జిల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఈనెల 29న ఉదయం 11గంటలకు జడ్చర్లకు వస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఫిబ్రవరి 7న లక్షా డప్పులతో హైదరాబాద్‌లో తలపెట్టిన మహాప్రదర్శన కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని కోరారు.

## వినియోగదారుల హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా మధు

జడ్చర్ల టౌన్: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మధుసూదన్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ బాలరాజు నియామక పత్రం అందజేశారు. తనపై విశ్వాసం ఉంచి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర చైర్మన్, జాతీయ చైర్మన్‌కు మధు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడుతానని ప్రకటించారు.

## వివాహిత అదృశ్యం

హన్వాడ: వివాహిత అదృశ్యమైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల ప్రకారం.. మండలంలోని అత్యకుంటతండాకు చెందిన యెన్నం చెన్నమ్మ ఆదివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టు పక్కల, బంధువులతో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. సోమవారం ఆమె తమ్ముడు బండారి రాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## సీనియర్ సిటిజన్‌లకు సముచిత స్థానం

నవాబుపేట: సీనియర్ సిటిజన్‌లకు సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత ప్రతివ్యక్తిపై ఉందని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం సీనియర్ సిటిజన్ ఫోరం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారికి సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. చట్టం సైతం వారి హక్కులను వివరిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయం కోసం మండల కేంద్రంలో 400 గజాల స్థలం ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని ఫోరం నాయకులు అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్‌ఫోరం నాయకులు నర్సింహులు, చౌదరి వెంకటేశ్వరప్ప, పండారినాథ్ ఉన్నారు.

## విద్యుదాఘాతంతో గేదెలు మృతి

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి గ్రామ శివారులో గౌస్ పాషకు చెందిన మూడు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. అంజ్యనాయక్, టోప్యనాయక్ వ్యవసాయ పొలంలో మేతమేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. వాటి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ



విద్యార్థులకు టెస్టు పేపర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించాలని ఎంఐఎం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ అధ్యక్షతన సోమవారం వీరన్నపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఉర్దూ మీడియం ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్‌ఇన్‌వన్ మాడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారని, చదువుకుంటేనే పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. ఎలాంటి వృత్తులు, శాశ్వత జీవనోపాధుల్లేని ముస్లింల మనుగడ చదువుతో ముడిపడి ఉందని గుర్తు చేశారు. లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. పేద విద్యార్థులకు చేయూతను ఇవ్వాలన్న ఉద్దేశంతో తమ పార్టీ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు గత కొన్నేళ్ల నుంచి మోడల్ పేపర్లను, గైడ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంఐఎం ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, ఓవైసీ ఎక్సలెన్స్ స్కూల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హెల్త్‌సెంటర్లు ఏర్పాటు చేసి నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా ఇన్‌చార్జి జాబిర్ బిన్ సయీద్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ.హాదీ, ప్రధాన కార్యదర్శి జాకీర్ అడ్వకేట్, పట్టణశాఖ సాదతుల్లా హుస్సేని, నాయకులు పాల్గొన్నారు.

# సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో జరిగిన మండలంలోని ఆరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదవటం, రాయటం తప్పనిసరిగా నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు సైతంబోధన సామర్థ్యాలు ఎప్పటికప్పుడు మార్చుకోవాలన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్, టీఎల్‌ఎంలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అపార్ కార్డుల జనరేషన్ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మొదటిరోజున 50శాతం ప్రధానోపాధ్యాయులు హాజరుకాగా మిగిలిన వారికి మంగళవారం రెండోరోజు సమావేశం కొనసాగనుంది.

## మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన చైర్‌పర్సన్, కమిషనర్



నల్లకుంట పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నల్లకుంట మినీట్యాంక్‌బండ్‌ను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డిలు పరిశీలించారు. ట్యాంక్‌బండ్ వద్ద చిన్నపిల్లలు ఆడుకునేందుకు సామగ్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతకుముందు 6వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4లక్షలతో చేపట్టిన డ్రైయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుంకసారి రమేష్ పాల్గొన్నారు.

# ‘లక్ష డప్పుల’ కార్యక్రమం విజయవంతం చేద్దాం



గురుకుంటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న దండోరా నాయకులు

నవాబుపేట: వచ్చే నెలలో 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు శాంతయ్య, టైగర్ జంగయ్యలు తెలిపారు. సోమవారం మండలంలోని గురుకుంటలో మండల ఎంఆర్‌పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెలలో చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి దండోరా సైనికుడు సిద్ధం కావాలన్నారు. ఈ నెల 29న జడ్చర్లలో జరిగే సన్నాహక సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ హాజరవుతారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీ సత్యం, మాజీ సర్పంచ్‌లు దండోరా నాయకులు శంకర్, బాలయ్య, ఆనంద్, వెంకటయ్య ఉన్నారు.

# ఎమ్మార్పీఎస్ కళాకారుల మండల కమిటీ



ఎమ్మార్పీఎస్ కళాకారుల మండల కమిటీ

గండేడ్: గండీడ్ మండల కేంద్రంలో లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమంలో అశోక్, వేపూరి సోమన్న, డాక్టర్ డప్పు స్వామి, మహబూబ్‌నగర్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు రొట్టె శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో గండీడ్‌మండల ఎమ్మార్పీఎస్ కళాకారుల మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చిట్లపల్లి మహేందర్, జంగ్లి వెంకటయ్య, గుముడాల చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా దొడ్డే బసప్ప, కొప్పుల భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా చంద్రయ్య, సహాయ కార్యదర్శులుగా ఏర్పుల మైశయ్య, చెన్నయ్య కప్లాపూర్, వెంకటయ్య, కోశాధికారిగా గాధిర్యాల్ అశోక్, ప్రచార కార్యదర్శిగా పందిమడుగు బచ్చయ్య, పాండు రంగయ్య, సోషల్ మీడియా ప్రతినిధిగా జోగు వెంకటేష్, కార్యవర్గ సభ్యులు చెన్నారం చెన్నయ్య, వేపూరి రామయ్య, లక్ష్మయ్య, గుముడాల గంగాపురిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆశన్న, మాజీ కుందేటి కిష్టన్న, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రాములు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కుచ్చర్‌కల్‌లో దివంగత అంజమ్మ, భీమయ్యగౌడ్‌ల స్మారకార్థం మాజీ సర్పంచ్ సుధారాణి ఆనంద్‌గౌడ్‌లు వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం మధ్యరాత్రి వరకు ఎంతో ఉత్కంఠంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు యాదయ్య, కృష్ణయ్యగౌడ్, కృష్ణయ్య, మహిపాల్‌రెడ్డి, వెంకట్, చంద్రకాంత్‌గౌడ్, సత్తయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడికి అవార్డు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక కళాకారుడు జక్క గోపాల్‌కు కేశవరావు జాదవ్ ఉద్యమకారుడి అవార్డు అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ 92వ జయంతి సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ కోదండరాం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, విమలక్కలు అవార్డులు ప్రదానం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు అవార్డులను అందించినట్లు గోపాల్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.